నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
10 కరీంనగర్, సోమవారం 9 డిసెంబర్ 2024 PEDDAPALLI

## గురుకుల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్8: గురుకుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ల క్ష్యం వీడాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి ఆవాల హరిబాబు కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చేపట్టిన గురుకులబాట కార్యక్రమం ఆదివారంతో ముగిసిందన్నారు. జిల్లాలోని గురుకులాలను సందర్శించిన బీఆర్‌ఎస్‌వీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గురుకులాల్లో అనేక సమస్యలను గుర్తించామన్నారు. ఆ వివరాలను నివేదిక రూపంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వేసిన కమిటీకి అం దజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హరీశ్‌వర్మ, అనిల్, భరత్, అరవిం ద్, శ్రీకాంత్, కౌశిక్, హరీశ్, సాగర్, భూపతి, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు నిర్లక్ష్యం..
# టీచర్లకు మూల్యం

- మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం అలసత్వం
- పథకాన్ని గాలికొదిలేసి భోజనం సరిగా లేదని పంతుళ్లపై చర్యలు
- నిర్వాహకులకు బిల్లులు, వేతనాలు ఇవ్వకుండా తమనెలా బాధ్యుల్ని చేస్తారంటూ ఉపాధ్యాయుల నిరసన
- ఆకాశంలో ధరలుంటే అత్తెసరు నిధులతో వంట ఎలా సాధ్యమని భోజన తయారీదారుల ఆగ్రహం
- స్కీం ప్యాట్రన్‌ను మార్చాలని విజ్ఞప్తులు
- నిధులు పెంచడంతోపాటు పర్యవేక్షణకు సిబ్బందిని నియమించాలని టీచర్ల డిమాండ్

ధరూర్ కాలనీ జడ్పీ పాఠశాలలో కూరగాయలు కోస్తున్న నిర్వాహకులు



ప్రభుత్వ పాఠశాలలను సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. పేద పిల్లల అర్ధాకలి చదువులకు స్వస్తి పలుకాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన మధ్యాహ్న భోజనం పథకాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ముందు నుంచీ నిర్వాహకులకు బిల్లులు, వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూనే, ఇటు స్కూళ్లలో భోజనం సరిగ్గా లేదంటూ హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఇన్‌చార్జి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటుండడం విస్తుగొలుపుతున్నది. పుండు ఓ చోట ఉంటే.. మందు మరో చోట రాసినట్టుగా.. తప్పు ఒకరిదైతే.. శిక్ష మరొకరికి వేయడం విమర్శలకు తావిస్తున్నది. ఇలానే ఇటీవల జగిత్యాల జిల్లాలో హెచ్‌ఎం, టీచర్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజన తయారీ విషయంలో ప్రభుత్వమే అనేక తప్పిదాలకు ఆస్కారం ఇస్తూ, తమను బాధ్యుల్ని చేయడం సరికాదని మండిపడుతున్నారు. స్కీం ప్యాట్రన్‌ను మార్చాలని, నిధులు పెంచడంతో పాటు పర్యవేక్షణకు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

జగిత్యాల, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం దాదాపు రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభమైంది. విద్యార్థుల కోసం ప్రభుత్వం నేరుగా బియ్యాన్ని పంపిణీ చేస్తూ వస్తున్నది. మిగిలిన దినుసులను నిర్వాహకులు సమకూర్చుకొని భోజనం తయారు చేసి వడ్డించాల్సి ఉంటుంది. వాస్తవానికి ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు చేరుతాయి. వారు తన పరిధిలో ఉన్న ఒక ఉపాధ్యాయుడిని మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జిగా నియమించాలి. సదరు టీచర్ ప్రతిరోజూ నిర్వాహకులకు బియ్యాన్ని అందజేయడంతోపాటు తయారైన భోజనం మెనూ ప్రకారం ఉందా.. లేదా..? నాణ్యతగా, రుచిగా ఉందా.. లేదా..? అని పరిశీలించాలి. అలాగే, ఆయా స్కూళ్లలోని ఉపాధ్యాయుల్లో ఎవరో ఒకరు రోజూ భోజనాన్ని ముందుగా తిని, నాణ్యతను నమోదు చేయాలి.

### అమలు కాని మెనూ..

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ చాలా అద్భుతంగా కనిపిస్తున్నా, ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదు. అయితే పెరిగిన ధరల నేపథ్యంలో ఎక్కడా కూరగాయలు, ఆకు కూరలు వండడం లేదు. అప్పుడప్పుడే కూరగాయల భోజనం వడ్డిస్తున్నారు. ఎక్కువగా సోరకాయలు, బెండ కాయలు వంటివి కొన్ని వేసి, కొంత పప్పు వేసి సాంబార్ చేసి వడ్డిస్తున్నారు. మెనూతో సంబంధం లేకుండా ఎక్కడ చూసినా ఇదే తిండి పెడుతున్నారు.



ఇక వారానికి మూడు సార్లు కోడిగుడ్డు పెట్టాలని ప్రభుత్వం నిర్దేశించినా, నిర్వాహకులు ఒక్కరోజే అందిస్తున్నారు. ఇక వెజిటబుల్ బిర్యాని, కూరగాయలు, ఆకు కూరలతో కూరల ముచ్చటే మరిచిపోయారు.

### డబ్బులు చాలడం లేదు.. మేమేం చేస్తాం

మంగళ, బుధవారాల్లో మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ'తో పలువురు మధ్యాహ్న భోజన నిర్వాహకులు తమ గోసను వెల్లబోసుకున్నారు. తమకు మధ్యాహ్న భోజనం గిట్టుబాటు కావడం లేదని, ప్రభుత్వం ఇచ్చే మొత్తంతో వంట చేయడం సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. శిశు నుంచి ఐదో తరగతి లోపు పిల్లల కోసం (ఒక్కొక్కరికి) వంద గ్రాముల బియ్యం, ₹5.45 ఇస్తుందని, ఇక 6 నుంచి 8వ తరగతి పిల్లల కోసం 150 గ్రాముల బియ్యం, ₹8.17 ఇస్తుందన్నారు. 9, 10వ తరగతి పిల్లలకు 150 గ్రాముల బియ్యం, ₹10.67 చెల్లిస్తున్నదని, ఈ డబ్బులతో భోజనం తయారు చేసి అందించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయని, ప్రభుత్వం ఇచ్చే ధరకు వాటిని కొనుగోలు చేసి భోజనం తయారు చేయడం సాధ్యం కాదని వాపోతున్నారు. ఇక పప్పుల ధరలు సైతం పెరిగిపోయినందున చిక్కటి పప్పు వేసి కూర చేయడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. కోడిగుడ్డు ఒక్కంటికి ప్రభుత్వం ₹5 చెల్లిస్తుందని, కానీ మార్కెట్‌లో ఒక ఎగ్ ధర ₹7 పలుకుతున్నదని చెబుతున్నారు. ఇలాంటప్పుడు ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో కోడిగుడ్డు ఎలా ఇవ్వగలమని, అందుకే వారానికి ఒక్కరోజు మాత్రమే పెడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం సిలిండర్లు ఇవ్వడం లేదని, వాటి ధరలు వందలు దాటి ₹వేలకు చేరుకోవడంతో వాటిని కొనుగోలు చేసి వినియోగించడం సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నామని, మనస్ఫూర్తిగా మాత్రం వండిపెట్టడం లేదన్నారు. పిల్లలకు నీళ్లలాగా ఉన్న పలుచని చారుతో భోజనం పెట్టడం తమకు సైతం ఇష్టం లేదని, అయితే విధి లేని పరిస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం అంటూ దొడ్డుబియ్యం ఇస్తున్నారని, అవి సరిగా ఉండడం లేదని, అన్నం ముద్ద అవుతున్నదని వాపోతున్నారు.

### టీచర్లను బాధ్యుల్ని చేయడం సరికాదు



మధ్యాహ్న భోజనం నాణ్యత, అమలు విషయంలో టీచర్లు, హెచ్‌ఎంలను బాధ్యుల్ని చేయడం సరికాదు. భోజనం తయారీ, నాణ్యత విషయంలో టీచర్ల పాత్ర నామమాత్రమే. బియ్యం పంపిణీ చేసే దాకా బాధ్యతలను నిర్వర్తించగలం. కానీ నాణ్యత, మెనూ అమలు, రుచి, తదితర అంశాల్లో వారి పాత్ర నామమాత్రంగానే ఉంటుంది. టీచర్లపై కీలక బాధ్యతలు ఉన్నాయి. స్మార్ట్ తరగతుల నుంచి మొదలు కొని ప్రత్యేక క్లాసుల దాకా చెప్పాల్సి వస్తుంది. అలాగే, కంప్యూటర్ పనులు పెరిగాయి. ఈ నేపథ్యంలో భోజన తయారీపై దృష్టి సారించడం కష్టం. వాస్తవానికి భోజన తయారీ అనేది నిధులు, వేతనం, మార్కెట్ ధరలపై ఆధారపడి ఉన్న అంశం. అందులో టీచర్లను ఇన్‌వాల్వ్ చేసి, భోజనం సరిగా లేదని చర్యలు తీసుకోవడం బాధాకరం. ఇప్పటికైనా ఆలోచించి, టీచర్లను భోజన తయారీ బాధ్యతల నుంచి మినహాయించాలి.

**- బోనగిరి దేవయ్య, టీపస్ జిల్లా శాఖ అధ్యక్షుడు (జగిత్యాల)**

### నాలుగు నెలలుగా అందని బిల్లులు.. గౌరవ వేతనం

జగిత్యాల జిల్లాలో విద్యా సంవత్సరం ఆరంభమయ్యేనాటికి మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడు నెలల బిల్లులు మంజూరు కాలేదు. జూలైలో బిల్లులు మంజూరు చేయగా, జిల్లాలో ఉన్న 1,475 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు కొంత చెల్లింపులు చేశారు. 8వ తరగతి వరకు బిల్లులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 దామాషా ప్రకారం చెల్లిస్తున్నాయి. బియ్యం మొత్తం కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నది. ఇక 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులకు సంబంధించిన పూర్తి చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తున్నది. కుక్కు, సహాయకులకు గౌరవ వేతనం అందజేస్తున్నారు. అయితే, దీనికి విద్యార్థుల సంఖ్యనే ఆధారం చేశారు. 25 మంది విద్యార్థుల లోపు సంఖ్య ఉంటే ఒక్క వంటమనిషి మాత్రమే ఉండాలి. 25 నుంచి 100 మంది లోపు విద్యార్థులు ఉంటే ఇద్దరు కార్మికులను వినియోగించుకోవాలి. 100 మందికి పైన ఉంటే ముగ్గురు కార్మికులను ఏర్పాటు చేయాలి. కుక్కుకు గౌరవ వేతనంగా కేంద్రం ₹వెయ్యి అందజేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ₹2వేలు అందిస్తున్నది. మొత్తంగా ఒక్కో కార్మికురాలికి నెలకు ₹3 వేలు చెల్లిస్తున్నారు. అయితే, ఆగస్టు నుంచి భోజన తయారీకి సంబంధించిన బిల్లులు, కార్మికులకు గౌరవ వేతనం రావడం లేదు. నాలుగు నెలలుగా బిల్లులు రాకపోతే భోజనం ఎలా తయారు చేయాలో చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజనం ధరలను డిసెంబర్ నుంచి పెంచుతామని ప్రభుత్వం చెప్పినా.. అవి వచ్చేదెన్నడో అని వాపోతున్నారు.

### ఇన్‌చార్జిలుగా ఉండలేం అంటున్నరు



మధ్యాహ్న భోజనానికి సంబంధించి టీచర్లను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం వల్ల టీచర్లు భయపడుతున్నారు. స్కూళ్లలో ఇప్పుడు మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జిలుగా ఉన్న వారు తాము బాధ్యతలు నిర్వర్తించలేమంటూ హెచ్‌ఎంల వద్దకు క్యూ కడుతున్నారు. మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించి, దాని కోసం ప్రత్యేకంగా వలంటీర్లను నియమించుకుంటే బాగుంటుంది. సబ్జెక్టు టీచర్లపై పిల్లల ఫలితాల సాధన ఒత్తిడితో పాటు, ఇతర అనేక బాధ్యతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీచర్లను బాధ్యులుగా చేయవద్దు.

**- యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, టీపీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి (జగిత్యాల)**

## బీఆర్‌ఎస్ కారు గద్దె ధ్వంసం



రాజేశ్వర్‌రావు నగర్‌లో కూల్చిన బీఆర్‌ఎస్ గద్దె

గంభీరావుపేట, డిసెంబర్ 8 : మండలంలోని రాజేశ్వర్‌రావునగర్‌లో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు బీఆర్‌ఎస్ పార్టీ కారు గద్దెను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బీఆర్‌ఎస్‌పై అభిమానంతో నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు నాలుగేళ్ల క్రితం గద్దెను ఏర్పాటు చేసి దానిపై కారు ఏర్పాటు చేశారు. వారం రోజుల క్రితం ఆ కారును తీసేయాలని ఎంపీడీవో తెలుపడంతో స్థానిక నేతలు దానిని తొలగించారు. అయితే, వారం గడవక ముందే గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో కూల్చిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ గద్దెను కూల్చినంత మాత్రాన కేసీఆర్, కేటీఆర్, కారు గుర్తును ప్రజలు సులువుగా మరచిపోలేరని చెప్పారు. ఆయన వెంట నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, కమ్మరి రాజారాం, పిట్ల బాబు, హన్మంతరెడ్డి, నర్సింహులు, ఎర్ర రామాంజగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, సురేందర్, సతీశ్, రాజిరెడ్డి ఉన్నారు.

## బురదలోంచి పోయేదెలా?



కొల్వాయి నుంచి చిన్న కొల్వాయి వెళ్లే రహదారి దుస్థితి

బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి నుంచి నేదునూర్, చిన్న కొల్వాయి, ఆరెపల్లి వెళ్లే ప్రధాన రహదారి ఇలా బురదమయంగా మారి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గతంలో వేసిన తారురోడ్డు పూర్తిగా పాడవడంతో ఇలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**- సారంగాపూర్, డిసెంబర్ 8**



మాట్లాడుతున్న జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## కాంగ్రెస్‌ది రాక్షస పాలన

- గురుకులాల సందర్శనకు వెళ్తుంటే గేట్లకు తాళాలు వేస్తరా..?
- అన్ని వసతులు ఉంటే భయమెందుకు..?
- ఎక్కడా చూసినా సమస్యలే
- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల టౌన్/రూరల్, డిసెంబర్ 8: 'బీఆర్‌ఎస్ గురుకుల బాటలో భాగంగా మేం విద్యాలయాల సందర్శనకు వెళ్తుంటే అడ్డుకుంటున్నరు. అనుమతి లేదని వెళ్లగొడుతున్నరు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నట్లయితే తాము వెళ్లకుండా గేట్లకు తాళాలు ఎందుకు వేస్తున్నరో చెప్పాలి. కాంగ్రెస్ సర్కారు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన అని' జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. గురుకులాల్లో అన్నీ సమస్యలేనని, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో పడేశారని ధ్వజమెత్తారు. మౌలిక వసతులు లేవని, పరిశుభ్రత కొరవడిందని, నాణ్యత లేని ఆహారం అందిస్తుండడంతో విద్యార్థులు దవాఖానల పాలు కావాల్సిన దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఇటీవల రాయికల్ మండలం అల్లీపూర్‌లోని పాఠశాలకు వెళ్తే గేట్లకు తాళాలు వేసి తమను లోనికి రానివ్వలేదని, ఇంది రమ్మ రాజ్యం అంటే ఇదేనా..? అని ప్రశ్నించారు. గడిచిన ఏడాదిలో 50 మంది విద్యార్థులు చనిపోయారని, ఉపాధి లేక సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఉచిత బస్సులు వద్దంటే మానేస్తామని, ఓ మంత్రి మాట్లాడడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి మంథెన మధు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, పట్టింపులేమితో గురుకులాల్లో ఏడాది కాలంలోనే 50 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకుల పాఠశాలలో ఆరు నెలలుగా కాస్మొటిక్ చార్జీలు చెల్లించడం లేదని, సమస్యలు పరిష్కరించేందుకు కనీసం విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతి కోసమే గత ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ వాటిని ఎత్తివేయడానికి కుట్ర చేస్తున్నదని జగిత్యాల జిల్లా గురుకుల పాఠశాల ఇన్‌చార్జి జక్కుల వెంకటేష్ మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ రామడుగు రాజేశ్, విద్యార్థి విభాగం నాయకుడు నాగేందర్ పాల్గొన్నారు.

## 'సమగ్ర శిక్ష' ఉద్యోగుల
# సమ్మెబాట

మండల విద్యావనరుల కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



- అరకొర వేతనాలతో అవస్థలు
- క్రమబద్ధీకరిస్తామని మరిచిన సీఎం రేవంత్‌రెడ్డి
- వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోని ప్రభుత్వం
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతున్న ఉద్యోగులు
- 10 నుంచి నిరవదిక సమ్మె

విద్యా శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు మళ్లీ సమ్మెబాట పడుతున్నారు. ఎన్నికలకు ముందు సమ్మెలో పాల్గొన్న వీరికి అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నారు. అరకొర వేతనాలతో జీవితాలు వెల్లదీస్తున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది కాలంలో అనేక విజ్ఞప్తులు, విన్నపాలు ఇచ్చినా తమ బాధలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో సిద్ధమైన పే స్కేల్ ఫైల్‌ను కొనసాగిస్తూ తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే ముఖ్యమైన డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్నారు. ఈ నెల 10 నుంచి పాల్గొనేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు.

కరీంనగర్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యా శాఖలో 18 ఏండ్ల నుంచి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వీరికి వేతనాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. 2006లో రాజీవ్ విద్యా మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థలో కలెక్టర్లు చైర్మన్లుగా ఉన్న త్రీమెన్ కమిటీ ద్వారా రోస్టర్ మెరిట్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఒప్పంద ఉద్యోగులుగా వీరిని ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఏపీవో, సిస్టం అనాలసిస్ట్ టెక్నికల్ పర్సనన్స్, ఆపరేటర్స్, డీఎల్‌ఎంటీ, మెసెంజర్లుగా, మండల స్థాయిలో ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఆర్‌సీఎస్ మెసెంజర్స్, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, పాఠశాల స్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీ యూఆర్‌ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీ ఆర్టిస్టులు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, వాచ్‌మెన్, వంట చేసే సిబ్బంది (కుక్‌లు), స్కావెంజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి హామీ ఏమైంది?

విద్యాశాఖలో విలీనం చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని గతేడాది 22 రోజుల పాటు సమ్మెకు దిగగా, టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023 సెప్టెంబర్ 13న హన్మకొండలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు హామీలు ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చాయ్ తాగినంత సమయంలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు తమ గోడును కూడా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. నిజానికి అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ హయాంలోనే పే స్కేల్ ఫైల్ సిద్ధమైంది. ఎన్నికలు రావడంతో ఫైల్ మరుగున పడిపోయింది. లేదంటే అప్పుడే తమ సమస్యకు పరిష్కారం లభించేదని ఉద్యోగులు చెబుతున్నారు.

### ఇతర రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ

దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలు సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు అందుతున్నాయి. మహారాష్ట్ర, ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పే స్కేల్ అమలు చేస్తున్నారు. అంతే కాకుండా, సుప్రీం కోర్టు ఇచ్చిన జీవో నంబర్ 4 ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తున్నారు. కానీ, రాష్ట్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా వేతనాలు ఇస్తున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే కనీసం దహనక్రియల ఖర్చులు కూడా చెల్లించడం లేదు. 61 ఏండ్లు నిండిన ఉద్యోగి ఉద్యోగ విరమణ చేస్తే రిటైర్‌మెంట్ ప్రయోజనాలు కూడా కల్పించడం లేదు. తమను క్రమబద్ధీకరించాలని కోరినా ప్రస్తుత ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ఆరోపిస్తున్నారు.

### అన్ని పనుల్లో భాగస్వాములైనా..

సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రభుత్వం అప్పగించిన పనిలో భాగస్వాములవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పని విద్యను బోధిస్తూ వారిలో సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం సరఫరాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. యూడీఎస్ ప్లస్‌లో డ్రాఫ్ట్ పిల్లల్ని ఇంపోర్ట్ చేయడం, రాపోట్ చేయడం, ప్రొఫైల్స్ అప్‌డేట్ చేయడం, డీఎస్ఈ, ఎఫ్‌ఆర్‌ఎస్ విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును ఎప్పటికప్పుడు చూసుకోవడం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌కు సంబంధించిన ప్రతి విషయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తూ విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం అప్పగించిన ఇతర కార్యక్రమాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే విధులు నిర్వహిస్తూ అరకొర వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారు.

**ప్రధానమైన డిమాండ్లు**

- సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. అప్పటి వరకు పే స్కేలును అమలు చేయాలి.
- సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి
- మహిళా ఉద్యోగులకు వేతనంతో 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు చెల్లించాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా కింద రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా కింద రూ. 5 లక్షలు కల్పించాలి.

### 10 నుంచి నిరవదిక సమ్మె..

సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 నుంచి మరోసారి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవదిక సమ్మెకు దిగుతున్నారు. అందులో భాగంగా గత నెల 22న తెలంగాణ సమగ్ర వర్క్, ఆర్ట్స్ ఫిజికల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌ఎస్‌యూఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యా శాఖకు మొదటి సారి నోటీసు ఇచ్చారు. 15 రోజుల వ్యవధిలో ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నెల 6న మరోసారి సమ్మె నోటీసు అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 1,993 మంది సమగ్ర శిక్ష సమ్మెలో పాల్గొననున్నారు.



### చాలీ చాలని జీతాలతో గడుపుతున్నాం

మా విధులనే కాకుండా ప్రభుత్వం అప్పగిస్తున్న ప్రతి పనినీ చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగుల మాదరిగానే విధులు నిర్వహిస్తున్నాం. కానీ, సమాన పనికి సమాన వేతనం అందడం లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. కానీ, ఈ ప్రభుత్వం మా ఆక్రందనలను పట్టించుకోవడం లేదు. చాలీ చాలని వేతనాలతో ఏండ్ల తరబడిగా జీవితాలు నెట్టుకొస్తున్నాం. తప్పని పరిస్థితుల్లో మరోసారి సమ్మెకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి మాకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా..

**- కనుకుల రమేశ్, టీఎస్‌ఎస్‌యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

### ఇతర రాష్ట్రాల మాదిరే క్రమబద్ధీకరించాలి..



ఇతర రాష్ట్రాల మాదిరిగా మమ్మల్ని కూడా క్రమబద్ధీకరించాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లో పే స్కేల్ ఇస్తున్నారు. మేం మొదటిసారి సమ్మెలో ఉన్నపుడు హన్మకొండలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం. విద్యా వ్యవస్థ ఈ కార్యక్రమాన్ని అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సమయంలో ఈ సమస్యను పరిష్కరిస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఏడాదైనా పరిష్కారంకాలేదు. అందుకే సమ్మెకు వెళ్తున్నాం.

**- జీ రాజిరెడ్డి, టీఎస్‌ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు**

### క్రమబద్ధీకరణ ఒక్కటే మా డిమాండ్



మేం గత పద్దెనిమిదేండ్లుగా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికైనా రెగ్యులర్ చేస్తారని ఆశతో ఉన్నాం. ఇప్పటికే చాలా మంది రిటైర్‌మెంట్ వయసుకు వచ్చారు. ఇంకెప్పుడు రెగ్యులరైజ్ చేస్తారు. 2023లో సమ్మె చేసినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి అనేక హామీలు ఇచ్చారు. కానీ, ఒక్కటి కూడా అమలు చేయలేదు. సమాన పనికి సమాన వేతనం కోరుతున్నాం. శ్రమకు తగిన ఫలితం దక్కాలని విజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. **- చంద్రగిరి మహేశ్, టీఎస్‌ఎస్‌యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి**